మంచుతో అల్లాడుతున్న ప్రజలు

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పగలు ఎండ..రాత్రి చలి
- పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


పుల్లలచెరువులో చలి కాగుతున్న ప్రజలు


పుల్లలచెరువులో ఉదయం 7 గంటలకు కూడా మంచు ఇలా..

పుల్లలచెరువు: సీతాకాలం వణికిస్తోంది. చలిపంజా విసురుతోంది. మంచు తీవ్రత పెరుగుతోంది. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు పడిపోయి.. పగలు తీవ్రమైన ఎండ కాస్తోంది. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. అప్రమత్తంగా లేకుంటే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. కరోనా మళ్లీ ప్రబలుతున్న వేళ ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆరోగ్య రక్షణకు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. చలికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా వ్యవహరించాలి. జలుబు, జ్వరం బారిన పడకుండా చూసుకోవాలి. రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వాళ్లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మంచులో తిరగకూడదు. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో మలేరియా, డెంగీ విజృంభించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం దేశంలో కరోనా వంటి కేసులు పెరుగుతున్న వేళ ప్రతి ఒక్కరూ మాస్కు ధరిస్తూ, ప్రత్యేక ఆరోగ్య సూత్రాలు పాటించాల్సిన అవసరం ఉంది. ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

నెలల బిడ్డలు, తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి. ఏడాది లోపు పిల్లలకు చలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. చలితో ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వస్తే వారి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి. ఆస్తమా రోగులు ఆయాసం రాకుండా మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలి. చలిలో తిరగడం, చల్లని నీరు తాగడం చేయరాదు. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు మఫ్లర్, స్వెట్టర్‌తో పాటు కాళ్లకు సాక్సులు వేసుకోవాలి. వ్యాయామం చేస్తే శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. నీరు బయటకు వచ్చి చర్మం పొడిబారకుండా ఉంటుంది. జామ, ఉసిరి, నిమ్మ, ద్రాక్ష, క్యాప్సికం, క్యాబేజీ, టమాటో తదితరాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నీరు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్న వారు పాదాలు పగలకుండా బూట్లు వేసుకోవాలి. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు విధిగా మందులు వాడాలి.

జాగ్రత్తగా ఉండాలి:

చలికాలంలో ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. వాతావరణంలో వచ్చిన మార్పులతో వైరల్ జ్వరాలు, గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ లక్ష్మీనరసింహ, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు

అంగన్‌వాడీ కార్యకర్త నియామకానికి బ్రేకులు

- పంతాలు, పట్టింపులకు వెళ్లిన నేతలు
- తలలు పట్టుకున్న అధికారులు


ఎస్ఎస్‌పీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

కురిచేడు: కూటమి నాయకులకు పొత్తులు కుదరక ఎస్ఎస్‌పీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టు కోసం ఇంటర్వ్యూ వాయిదా పడింది. గతంలో అక్కడ కార్యకర్తగా పనిచేస్తున్న ఆశీర్వాదమ్మ అనారోగ్యం కారణంగా రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. గత ప్రభుత్వం ఈ ఖాళీని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ నోటిఫికేషన్ రద్దయింది. తిరిగి కూటమి ప్రభుత్వంలో గతేడాది డిసెంబర్ 11న నోటిఫికేషన్ ఇచ్చారు. డిసెంబర్ 23 వరకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యకర్త పోస్టు ఓసీకి కేటాయించడంతో ఆశావహులు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి నచ్చిన నాయకుడిని వారు ఆశ్రయించడంతో ద్వితీయ శ్రేణి నాయకులు తమ పంతం నెగ్గించుకునేందుకు జిల్లాలోని మంత్రులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలను ఆశ్రయించారు. ఒక్క పోస్టు కోసం ఇద్దరు మంత్రులు, జిల్లా నాయకులు ఇద్దరు, నియోజకవర్గ నాయకులు కొందరిని కలిసి ఎవరికి వారు తమకే కావాలని పంతం పట్టడంతో అధికారులు, నాయకులు ఇంటర్వ్యూని రద్దు చేయించారు. మండలంలోని మిగతా ఖాళీలకు యథావిధిగా ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని అధికారులు ప్రకటించారు.

గతంలో మండలంలోని కల్లూరు, కురిచేడు, బోయపాలెం అంగన్‌వాడీ కేంద్రాల పోస్టులకు వారు హైకోర్టును ఆశ్రయించగా అవి ఇంతవరకు నియామకం జరగలేదు. ఈ పోస్టుకు తిరిగి ఎప్పుడు నియామకం జరుపుతారోనని ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీర వెంకటాపురంలో రీ సర్వేపై గ్రామసభ


మాట్లాడుతున్న ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డి

దొనకొండ: మండలంలోని వీర వెంకటాపురం రిజర్వ్ పైలట్ విలేజ్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షతన గ్రామంలో రీ సర్వే గ్రామసభ బుధవారం నిర్వహించారు. గ్రామంలో 314.74 ఎకరాలను రెండు బ్లాక్‌లుగా విభజించామని, బ్లాక్–1 విస్తీర్ణం 159.27 ఎకరాలు, బ్లాక్–2 విస్తీర్ణం 155.47 ఎకరాలు భూమిని 4 నెలల్లో రీ సర్వే చేసి పత్రాలను సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని కోరారు. రీ సర్వే గ్రామ సభకు కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధనరెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడారు. గతంలో రీ సర్వే జరిగిందని, ఏమైనా తప్పులు జరిగి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేలో సరి చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. రైతులు ఏమైనా సమ్యలు ఉంటే నేరుగా రెవెన్యూ సిబ్బందిని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. రైతులకు కాలయాపన చేయకుండా సమస్య పరిష్కరించాలని ఆర్‌డీఓ తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ దర్బార్ మస్తాన్‌వలి, గ్రామ సర్వేయర్ ధనలక్ష్మి, వీఆర్‌ఓ మాచర్ల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు


పుస్తకాలతో మహిళలు

దొనకొండ: ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని, చదవు అనేది మూడో కన్ను లాంటిదని, మహిళలు చదువు నేర్చుకుంటే కుటుంబాన్ని నడుపుకోవాలనే జ్ఞానం ఉంటుందని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం 2వ విడత ఉల్లాస్ ట్రైనింగ్ వలంటీర్స్ టీచర్లకు, వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏపీఎం జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ఎస్.సాంబశివరావు హాజరై మాట్లాడారు. మండలంలో 5 గ్రామాలు ఆరవల్లిపాడు, పెదన్నపాలెం, నరసింహానాయునిపాలెం, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాలు ఎంపిక చేశారు.

చదువు రాని మహిళలను మొదటి విడతగా 1087 మందిని గుర్తించారు. బ్యాచ్‌కు 10 మంది చొప్పున 109 సెంటర్లు ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా మహిళలకు చదువు చెప్పించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. మహిళలు చదువుకుంటే ఎక్కడైనా మోసపోకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈఓఆర్‌డీ షఫీ, సీసీలు, వీఓఏలు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అట్టల పంపిణీ


అట్టలు అందుకున్న విద్యార్థులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్టీ) విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మావతి పరీక్ష అట్టలను బుధవారం పంపిణీ చేశారు. రూ.6 వేల విలువ చేసే అట్టలను 83 మంది విద్యార్థులకు పంపిణీ చేసిన ఆమెను ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్, హెచ్‌ఎం పిచ్చారావు అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధం


దగ్ధమైన టీవీ

పెద్దారవీడు: మండలంలో సానికవరంలో కామిశెట్టి శ్రీనివాసులు ఇంట్లో బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీవీ కాలిపోయింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పాత టీవీ కావడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూటైందని, ఇతర వస్తువులు కాలిపోలేదని, ప్రమాదం తప్పిందని చెప్పారు. టీవీ విలువ దాదాపు రూ.10 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

పింఛన్‌ల వెరిఫికేషన్


పింఛన్ వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్‌ల వెరిఫికేషన్ కార్యక్రమం బుధవారం జరిగింది. పూర్తి స్థాయిలో మంచంలో ఉండి రూ.15 వేల పింఛన్ తీసుకుంటున్న 25 మందిని జనరల్ ఆర్థో అశోక్‌కుమార్, జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య, మారెళ్ల పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్, డిజిటల్ అసిస్టెంట్ జెస్సీ ప్రతాప్ బృందం పరిశీలించింది. పులిపాడులో మూడు, పెద్ద ఉల్లగల్లులో రెండు, ముండ్లమూరులో ఒకటి, నాయుడు పాలెంలో నాలుగు, పోలవరంలో ఒకటి, ఉమామహేశ్వరపురంలో రెండు, నూజిల్లపల్లిలో ఒకటి, మారెళ్లలో ఎనిమిది, ఈదరలో మూడు పింఛన్‌ల వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మంచంలో ఉండి లేవలేని పరిస్థితుల్లో ఉన్నవారి పింఛన్‌లు మాత్రమే ప్రస్తుతం వెరిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు.

25 మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్సై నాగరాజు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని శంకరాపురంలో అక్రమంగా విక్రయిస్తున్న 25 మద్యం బాటిళ్లను ఎస్సై నాగరాజు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్ముతున్న బెల్లంకొండ రవీంద్రబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందిస్తే వారి విషయాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

శ్రీను మృతదేహానికి బూచేపల్లి నివాళి


శ్రీనివాసరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి


వెంకట సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి: పట్టణంలోని ఎదురు వారి బజారుకు చెందిన ఎదురు శ్రీనివాసరెడ్డి అనారోగ్య కారణంతో బుధవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి.. శ్రీనివాసరెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్నీ విధాలా అండగా ఉంటానని బూచేపల్లి హామీ ఇచ్చారు.

దశదిన కర్మకు హాజరు

కౌన్సిలర్ అవుల శివారెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి దశదిన కర్మకు ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వెంకట సుబ్బారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

దర్శి: మండలంలోని జముకులదిన్నె గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు ప్రకాశం హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆస్పత్రిలో గోరంట్ల శ్రీనును పరామర్శించారు. ఆరోగ్య విషయం వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి


దొండేటి నాగేశ్వరరెడ్డి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పెద్దదోర్నాల మండలం కొత్తూరుకు చెందిన దొండేటి నాగేశ్వర రెడ్డి బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనను ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన జగనన్నకు, పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఉన్నత పదవి బాధ్యతలు అప్పజెప్పిన వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లాలో తన వంతు ఐటీ సేవలు అందిస్తానని, వైఎస్సార్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగం పెంచుతున్న మోదీ ప్రభుత్వం


సభలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి

యర్రగొండపాలెం: కేంద్రంలో నరేంద్రమోదీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా దేశవ్యాప్తంగా నిరుద్యోగతను పెంచి పోషిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి విమర్శించారు. బుధవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత యువజన సమాఖ్య నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని, నిరుద్యోగాన్ని రికార్డు స్థాయిలో పెంచేసుకున్నారని, సమగ్ర యువజన విధానం ద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ రాయితీతో కోట్లాది రూపాయలు ప్రజల సొమ్మును దోచుకుంటున్న ధనవంతుల సంపాదన ప్రజలకు పంపిణీ చేయాలన్న డిమాండ్‌తో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. మోదీ విధానాల ద్వారానే కార్పొరేట్లు రోజురోజుకూ కోట్లది రూపాయలు ఆదాయం పొందుతున్నారని, ధనవంతులకు బ్యాంకు రుణాలు మాఫీ చేస్తూ ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటన్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి అమరావతి అభివృద్ధి చేస్తున్నారని, రాజధాని అన్ని ప్రాంతాల వారికి సంబంధించినదని, అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో అందరికీ భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 26న ఒంగోలులో జిల్లా మహాసభ జరుగుతుందని, ఈ సభలో సమగ్ర యువజన విధానం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నూతన నోటిఫికేషన్‌లు వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నియోజకవర్గ స్థాయి నూతన కమిటీని ఎంపిక చేసుకున్నారు. కన్వీనర్‌గా యద్దనపూడి కోటయ్య, కో కన్వీనర్లుగా కె.వెంకటేశ్వర్లు, టి.శ్రీను, సభ్యులుగా వై.ఏసుబాబు, డి.ఆదిత్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, డి.శ్రీనివాస్, కేవీ కృష్ణగౌడ్, బాణాల రామయ్య పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచేందుకు వ్యాధులను నియంత్రించాలని, పశు పోషకులకు సేవలు మరింత చేరువ చేసేందుకు అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి నాగుల్‌మీరా అన్నారు. అందులో భాగంగా బుధవారం ఉమ్మడివరం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులు, మేకలకు వ్యాపించే వ్యాధులకు టీకాలు వేసి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. శిబిరాలు 31వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పశువులను తీసుకొచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు. సిబ్బంది హిమబిందు, నాగరాజు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించండి


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: వాహనదారులు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని పలు చోట్లు జిల్లా అధికారుల ఆదేశాలపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించి ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుతం పరిమితికి మంచి కూలీల ఆటోలు వెళ్తున్నాయని, పరిమితికి మించి కూలీలను ఎక్కించుకుంటే తప్పని సరిగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నియమాలను పాటిస్తూ వాహనదారులు రహదారి నియమాలు పాటించాలన్నారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: సాగు చేసిన పంటల్లో సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని రాచకొండ, నరజాముల తండా గ్రామాల్లో సాగు చేసిన శనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని, ప్రతి ఒక్క రైతు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందే పంటల బీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి అనేక పథకాలకు దీని ద్వారానే రైతులను గుర్తించనున్నట్లు తెలిపారు. శనగ పంటలో సస్యరక్షణ చేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రశాంత్, హనుమాన్‌నాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లోని రైతులు పొగాకు, మిర్చి వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాలైన రాగి, కొర్ర పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం దొనకొండ రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు సూచనలు, సలహాలందించారు. చిరు ధాన్యాలైతే పెట్టుబడి ఖర్చు తక్కువని, పశువులకు మేత సమస్య తీరి పోతుందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన కంది, మిరప మరియు జొన్న పంటలను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది రవితేజ, ఏఈఓ యోగేశ్వరరావు పాల్గొన్నారు.